

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



### మార్చుకోండి తీర్చుకోండి మల్లెమొగ్గల్లారా!

**దిన వారాలతో సంబంధాలు** తెగిపోయి, పగలు రాత్రి అనే కొలమానాలతో మాత్రమే రోజులు గడుస్తున్నాయి. యుద్ధ ప్రణాళికన గట్లు తుడుస్తూ తుడుస్తూ వెళ్తోంటే ఎదురుగా అద్దంలో నా మొహం నాకే వింతగా కనిపించింది. క్షణ కాలం నేనేనా అని తేరి పారా చూసుకున్నా. కనుబొమ్మల మధ్య ముడి వీడనంటే వీడను అంటోంది. చేతిలో ఉన్న ఆయుధాలు అన్ని త్యజించి, తదేకంగా నన్ను నేనే చూసుకున్నా, తేడా తెలుసుకుందామని. టెన్షన్ మింగినట్టు ఉంది నా మొహం. ఎందుకూ? ఏమైందని? ఏదో గాభరా ఎప్పుడూ.

మెల్లిగా ఊపిరి తీసి వదిలి కనుబొమల మధ్య ముడిని సవరదీసి పెదాలను కొంచం సాగదీసి నవ్వితే అప్పుడు కనిపించా నాకు తెలిసిన, నాకు గుర్తున్న నేను. కొబ్బరాకుల వెనుకాల దాగివున్న చందమామతో దాగుడు మూతలు ఆడుకున్ననేను, పౌర్ణమి వెన్నెల ఊరినిండా ఒలికి ఆగడం అయిపోతోందని బాధ పడిన నేను, వెండి మువ్వల సవ్వడికి నిద్రలో ఉన్న నాన్న లేస్తారేమో అని మునికాళ్ళపై నడిచిన నేను. ఎంత బాగున్నాను. ఏవిటా చప్పుడు, టిక్ టిక్ మని? ఇంకెవరు గడియారం. చేతులు నడుముపై పెట్టుకుని "ఊఁ! ఎంతసేపు ఇలాగ. త్వరగా తెములు," అని తర్జని చూపిస్తోంది. అదిగో కష్టపడి విడదీసిన ముడి మళ్లీ పడిపోయింది.

ఈ గాభరాకి కారణం రోజూవారి పనులు కానే కాదు. పొద్దుటి నుండి వంచిన నడుము ఎత్తకుండా రథం ముగ్గు గీసినట్టు చేసుకుంటూ వెళ్లి రాత్రి దగ్గర తాడు విడిచి వస్తామా, మళ్లీ తెల్లారి లేచేపాటికి రథచక్రాలు వాకిట్లో సిద్ధంగా ఉంటాయి. వీటితో పడి పడీ మొండివాడు రాజుకన్నా బలవంతుడని ఎప్పుడో సంధి చేసేసుకున్నాము. కాస్త రాజీ పడి చిట్కాలు కనుక్కుని నాదైన బాణీ కనిపెట్టేసి ఈ పనులని ఎప్పుడో లొంగదీసేసుకున్నా. మాకు అవి వాటికి మేము అలవాటైపోయాము. పైగా దుమ్ము ధూళి అట్టే లేనిచోట, ఉన్న ఇద్దరూ తలా ఒక చెయ్యేసే చోట ఏం కష్టం! చేతికి అన్ని అందించినా తేల్చేసే చుట్టాలా, లేరు ఎలాగూ. వచ్చే స్నేహితులు ఎలాగూ వండుకుని సర్దేదాకా తోడుగా ఉంటారు. అందుకే 'పనివాళ్లు ఉండరటగా' అనే వెక్కిరింత ఫేస్బుక్ లో ముక్కూ మొహం తెలియని పిల్లను ఫ్రెండ్ గా ఆడ్ చేసుకుని ఆ పిల్లని ముక్కుతుడిచి పెంచినంత చనువుగా వెకిలి కామెంట్లు పెట్టె అంకుల్స్ అంత 'చీప్' అనమాట. సహాయానికి వస్తారో, రారో, సరిగ్గా చేస్తారో చెయ్యరో అనే దిగులు అస్సలు ఉండదు. సగం గుండెదడ తగ్గినట్టే. చేసుకోడం కన్నా చేయించడమే చాలా కష్టం బాబు. లేచినదగ్గరి నుండి ఇంటి పని చేసే పిల్లతో, వంటమనిషితో మంతనాలు చేస్తూ వారి వెనకే ఉండి సరిచేస్తూ మానసికంగా అలసిపోయే నా స్నేహితురాలి సాక్షిగా చెప్తున్నా. అయినా ఏఏ పరిస్థితులకి తగట్టు ఆయా సర్దుబాట్లులే.

ఇప్పుడొచ్చిన సమస్యల్లా అదుగో మల్లెపూల సోనపైన మబ్బుల దుప్పటి కప్పుకుని పడుకున్న నెమలీకలా అమాయకంగా కనిపిస్తోన్న ఆటంబాబు గురించి. మూణ్ణెల్ల నుండి ఇంట్లోనే ఉండి ఇంటిని కిష్కింధ చేస్తున్న పిల్లదాని గురించి. పగలంతా ఎండలో ఉంచి సాయంత్రానికి

తీసి చుట్టిపెట్టిన 'టెన్ థౌసండ్ వాలా' లా ఉంది నా కళ్ళకి. ఇంకొద్దిసేపట్లో లేస్తుంది సీమటపాకాయ్. అంతే! ఇక అప్పుడు మొదలెడితే మళ్లీ అర్ధరాత్రి దాకా టపా టపా విసుగూ విరామం లేకుండా పేలుతూనే ఉంటుంది. ప్రపంచం మొత్తం మీద ఎన్ని ఇళ్లు మారుమోగిపోతున్నాయో ఇలా. దీంతో ఆటలు ఆడలేక నీరసం వస్తోంది నాకు.

అంటించి వదిలిన భూచక్రంలా తిరుగుతూనే ఉంటుంది. పోనిలే అనుకోవచ్చు. నన్నుకూడా తనతో పాటే తిరగమంటుంది. ఎట్లా వేగేది? చిన్న సైజు క్వశ్చన్ బ్యాంకులా ఒకటే ప్రశ్నలు. ఒకదానికి సమాధానం చెప్పేలోపు ఇంకో ప్రశ్న.

"ప్రతి రోజూ ఎందుకు తెల్లారుతుంది? "

" సూర్యుడు వస్తేనే తెల్లారుతుంది కదా, మరి చంద్రుడు రాకపోయినా ఒక్కోసారి రాత్రి ఎలా అవుతుంది?"

"చిట్టి చిలకమ్మని వాళ్ళ అమ్మ ఎందుకు కొట్టింది?" ఇలా ఇక అంతులేని ప్రశ్నలు.

ఆ వయసులో పక్కింటి పిల్లతో చేరి ఒకరిపై ఒకరం మట్టిపోసుకుని ఆడుకోడం మాత్రమే గుర్తుంది నాకు. ఇన్ని ప్రశ్నలు వేసి ఉంటే మా అమ్మ ఏమైపోయేదో ?

మా వాళ్లు నాపై పెట్టిన నిఘా లాగా తెల్లార్లు గూఢాచారిలా నా కూడా ఉంటుంది. 'మా అమ్మని చీమ కుట్టింది' అని వీడియో కాల్ లో అందరికీ నా మొహం చూపించి పరువు తీస్తుంది. ఒక్క సినిమా చూడడానికి లేదు. ఏ పనికిమాలిన విషయం పట్టేసుకుంటుందో అనే భయం. అంత అందంగా ఉంటాయి మన సినిమాలు. అసలు సినిమాలు చూసి పాడవ్వకుండా పెరిగాం అంటే గొప్పే అని చెప్పుకోవాలి అనిపిస్తుంది నాకు. అంత అమాయకంగా ఉండేవాళ్ళం ఇప్పటి వాళ్ళతో పోలిస్తే.

కథలు చెపుదాం అంటే, ఆ కథల్లో చీమ నుండి దోమ వరకు ఎవరికీ ఏమి కాకూడదు. రాక్షసులు కూడా పరమ సాత్వికుల్లా గంగి గోవు దూడల్లా ఉండాల్సిందే. నాకు తెలిసిన కథల స్క్రీన్ ప్లే లన్ని మార్చి చెపితే కానీ కుదరదు. రసం పిండేసిన నిమ్మకాయ తొక్కులా అయిపోతున్నా సాయంత్రానికల్లా. వీళ్ళు మాత్రం అలుపు సొలుపూ లేకుండా అర్ధరాత్రి దాకా అదే ఉత్సాహంతో ఉంటారు. 'పని ముద్దా బిడ్డ ముద్దా!' అనేది అమ్మమ్మ. బాగా తెలిసొస్తోంది. పిల్లలకి పిల్లలే కావాలి. ఈ కరోనా కాలంలో అన్ని కరువే, ఆఖరికి పిల్లలకి పిల్లల కరువు.

పాపం పిల్లలని చూస్తుంటే జాలేస్తోంది. ఇంట్లోనే మగ్గిపోతున్నారు. ఎన్ని ఆటలు ఆడించినా సరిపోదు. వదిలేస్తే వీడియో గేమ్స్ అంటూ స్క్రీన్ లకి అతుక్కుపోతారు. వీడియో ప్లే డేట్స్ అని స్నేహితులని కూడా స్క్రీన్ లో చూపెట్టాల్సిందే. సీతాకోకచిలుకలా ఎగరాల్సిన బాల్యం పంజరంలో చిలుకలా అయిపోయింది. ఆఖరికి నావంతు రాక్షస ప్రయత్నాలన్నీ చేశా. అలసట తప్పించి వేరే లాభం లేకుండా పోయింది. విసుగుతో ఒకమాట అన్నా చిన్నబుచ్చుకునే మొహాలు చూస్తే ఏదో అపరాధ భావన. ఈపాటికి స్కూల్కెళ్ళి తన తోటివారితో ఆడి పాడి అలసి ఇంటికి రావాల్సిన పిల్ల. తన తప్పేం ఉంది! ఇలా ఇళ్లల్లో ఎన్ని రోజులు ఉంచగలం.

ఇంకా అమ్మ పూర్తిగా జడలు దువ్వకముందే గుమ్మం దగ్గర వేళ్ళాడుతూ ఉండేవాళ్ళు నా చిన్ననాటి నేస్తాలు. ఇలా జడ వేయించుకోడం పూర్తయ్యేదో లేదో అలా తూనీగలా తుర్రున పారిపోయేదాన్ని. ఆకలేస్తే కానీ ఇల్లు గుర్తొచ్చేది కాదు. స్వేచ్ఛగా ఎదిగిన బాల్యాలు ఇకపై పుస్తకాల్లోనే చూస్తామేమో? ప్రతిచోటుకి అమ్మో నాన్నో నీడలా వెంట వెళ్లాల్సిందే. ఇప్పుడు అదీ లేదు. "నాతో ఎవ్వరు ఆడరు. నా ఆటలు నీకు రావు, నాకో ఫ్రెండ్ కావాలి" అని కళ్ళలో నీళ్లు నింపుకుని అడిగే పిల్లని చూస్తే మాటలు రావడం లేదు.

ఆటపాటల్లో కేరింతలు కొట్టే చిన్నపిల్లల్ని చూడాలనిపిస్తోంది. ఇప్పుడు చలిమిడి ముద్దల్లా వీడియో గేమ్లకి అతుక్కుపోతోన్న పసిమొగ్గల్ని, టిక్ టాక్ లోను యూట్యూబ్ లలోను ముదర మాటలు మాట్లాడే ఆరిందల్నిచూడాల్సొస్తోంది. అన్నిచోట్లా మానసికంగా అలసిపోతున్నాము కానీ శారీరకంగా ఏ కష్టం ఉండడం లేదు ఎవరికీ. మనవరకూ చక్కని రంగురంగుల బాల్యం అనుభవించేసాము. మరి వీళ్ళకి?

అన్నీ నేనై పెంచాలంటే అసలు సాధ్యమయ్యే పనేనా?

పిల్లలు పెరగాలంటే అమ్మ నాన్న మాత్రమే సరిపోతారా? ఒక ఊరు ఊరంతా కలిస్తే కానీ ఒక చిన్నారి పెరిగి పెద్దవారు కాలేరు కదు! గోకులం మొత్తం ఉండబట్టి కృష్ణుడి అల్లరి తట్టుకోగలిగింది కానీ, యశోద ఒక్కదాని వల్ల అయ్యేపనేనా? ఇటువంటి పరిస్థితి మళ్లీ రాకూడదు. స్కూళ్లు, చదువులు, స్నేహితులు, కొట్లాటలు, ఆట్లాటలు, పిక్నిక్లు ఇవన్నీ లేకుండా ఎలా పెరుగుతారు పిల్లలు. వాళ్ల ఊహలను అర్ధం చేసుకుని తోడుగా ఇంకొన్ని ఊహలని అందించే నేస్తాలు లేకపోతే ఎలా? తప్పులు చేసి వాటి నుండి జీవిత పాఠాలను నేర్చుకునేందుకు బయటికి వెళ్లాల్సిందే కదా. ఈ చెర ఎన్ని రోజులో ఇక.

ఈ ఏడు బడిలో చేరాల్సిన పిల్ల. స్కూల్స్ తెరుస్తారో లేక ఆన్లైన్ లోనే చెప్తారో అని ఒకటే బెంగగా ఉంది తల్లితండ్రులకి. ప్రపంచం మొత్తం 2020 కి ముందు 2020 కి తర్వాత గా చూడాలేమో ఇకపై.

మా స్కూలు, అందులో నాకు నా ప్రాణ స్నేహితురాలికి మాత్రమే తెలిసిన చోటు, మూడో నెంబరు స్తంభం కింద మేము మా పేర్లు రాసి దాచుకున్న ఆశ చాక్లెట్ రాపర్లు, మేము మా గ్యాంగ్ పంచుకున్న రహస్యాలు, ఒకరిపై ఒకరం అలిగి పోట్లాడుకున్న క్షణాలు, అర మార్కు కోసం జరిగిన యుద్దాలు, ట్యూషన్ లో చేసిన అల్లరి, గెలుచుకొచ్చిన  షీల్డులు జడలు పైకి కట్టుకురాలేదని  డ్రిల్ సర్ చేతిలో తిన్న తిట్లు, స్కూల్ మైక్ లో వందేమాతరం పాడుతూ జలుబు చేసి తుమ్మితే వచ్చిన రీసౌండు ఇవన్నీ కలిస్తేనే కదా బాల్యం. ఇవన్నీ బుడ్డదానితో కలిసి మళ్లీ తన బాల్యంతో మొదలెట్టి చూడాలని ఎన్ని అనుకున్నాను. నేను మర్చిపోతున్న నన్ను పాపలో చూసుకుందామని ఎన్ని కలలు కన్నాను.

దివి నుండి దూకే సురగంగ లాంటి ఉత్సాహంతో ఉరకలెత్తే  పిల్లలని నాలుగు గోడల మధ్యన కట్టడి చెయ్యడం మన తరమా? ఇద్దరూ ఉద్యోగాలు చేసుకునే వారికి ఎంత కష్టం. పిల్లలు ఒంటరైపోతున్నారు. త్వరగా మాములు రోజులు వచ్చెయ్యాలి. వచ్చాక మళ్లీ ఇలాంటి విపత్తులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ క్వారెంటైన్ సమయంలో పోగొట్టుకున్న వాటికి రెట్టింపు ఆనందాలని తిరిగి వారికి ఇవ్వాలి. జీవితపు పరుగు పందెంలో నిలబెట్టే గుర్రాల లాగా కాకుండా, స్వేచ్ఛగా తమ సొంత భావాలతో ఉత్సాహంగా గెంతులు వేసే జింక పిల్లల్లాగా పెంచడానికి ప్రయత్నించాలి. నేర్చుకున్న కరోనా పాఠాలు అస్సలు మరచిపోకూడదు.

“మేము చిన్నప్పుడు బావిలో బెండ్లు కట్టుకుని ఈతలు కొట్టేవాళ్ళం, ఉలింజి కాయల నుండి ఈతపళ్ళ వరకు మేమె వేటకు వెళ్లి కోసితెచ్చుకుని తినేవాళ్ళం, వెన్నెల రాత్రులు చుకు చుకు పుల్ల దగ్గరనుండి చెడుగుడు వరకు పెద్దాళ్లు వెతుక్కుంటూ వచ్చేదాకా ఆడుకుంటూనే ఉండిపోయేవాళ్ళం.” అని చెప్పామే అనుకోండి, “మరి మమ్మల్ని ఎందుకు ఆ ఆనందాలకు దూరంగా నాలుగు గోడల మధ్యన మీ నీడలోనే ఉంచేసారు?” అని అడిగితే ఏం సమాధానం చెప్పగలం. అంతరిక్షంలోకి మనుషులని పంపిస్తున్నాము, మన పిల్లలని కనీసం వీధి మలుపు వరకు కూడా ఒంటరిగా పంపించలేము. ఎంత పురోగతి సాధించామో కదా?

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments